


యాప్‌లో సంఘాల వివరాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

స్వయం సహాయక సంఘాలు, సభ్యుల వివరాలు ఈనెల 25వ తేదీలోగా లోకోస్ యాప్‌లో పొందుపరచాలని డిఆర్‌డిఎ పీడీ సుధారాణి అన్నారు. బుధవారం పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లిలో నిర్వహించిన సమావేశంలో పొదుపు సంఘాల మహిళలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించి ఆన్‌లైన్ చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి సంబంధించి 1562 గ్రామీణ సంఘాలకు గాను సుమారు 17 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఇందులో 150 సంఘాల వివరాలతోపాటు 2600 మంది మహిళల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం బి.సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు... విద్య ద్వారా దేశాభివృద్ధి... అంటారు మన జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు. ఇంకొంచెం ముందుకు వెళ్తే విద్య తరగని గని... విద్య లేనివాడు వింత పశువు అని కూడా పెద్దలు అంటుంటారు. కానీ, ఆచరణలో నేటి పాలకులు ఉచిత విద్యను ప్రభుత్వం పేదలకు అందకుండా చేస్తోంది. అందుకే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరిట ప్రస్తుతం ఉన్న మూడు రకాల పాఠశాలలను తొమ్మిది రకాలుగా మార్చేసి, పాఠశాలల సంఖ్యను తగ్గించాలని, తద్వారా ఉపాధ్యాయ పోస్టులనూ కుదించుకోవాలని భావిస్తోంది. దాదాపు ఇదే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం జిఒ నెంబర్ 117తో ముందుకు సాగింది. దీన్ని రద్దుచేస్తామని చెప్పిన సిఎం చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కొత్తసీసాలో పాత సారా నింపిన మాదిరిగా అవే విధానాలతో తాజాగా జిఒ నెంబర్ 19,20,21ను జారీచేశారు. దీంతో, ప్రభుత్వం మారినప్పటికీ పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరంచేసే విధానం మాత్రం కొనసాగనుంది.

పునర్ వ్యవస్థీకరణ పేరిట పాఠశాలల కుదింపు

- ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు
- పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరం



విజయనగరంలో మూతపడనున్న పాఠశాల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేస్తూ జీవో 19,20,21లను విడుదల చేసింది. వీటి ప్రకారం ప్రకారం ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పిపి-1, పిపి-2 స్కూళ్లు, యుపి స్కూళ్లు, హైస్కూళు, ఏకోపాధ్యాయ స్కూళ్ల తదితర తొమ్మిది రకాల పాఠశాలలుగా మార్చనున్నారు. ఈ విధానం వల్ల పాఠశాలల సంఖ్య, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోవడం మినహా విద్యార్థులకు అదనంగా సమకూరే ప్రయోజనాలంటూ ఏమీ లేవన్నది ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల వాదన. పరిస్థితులు కూడా ఇందుకు తగ్గట్టే కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ 1,2వ తరగతులతో నడిచే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఉంటాయి. కొన్ని గ్రామాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు నడిచే ఉన్నత పాఠశాలలు ఉంటాయి. ఇలాంటి చోట ప్రైమరీ, లేదా ఉన్నత పాఠశాలల్లో తమకు నచ్చిన పాఠశాలలకు పిల్లలను తల్లిదండ్రులు పంపుతారు. ఇటువంటి చోట పిల్లలు తక్కువగా ఉన్నారన్న నెపంతో ఆ గ్రామంలోని బేసిక్ ప్రైమరీ స్కూళ్లను తాజా విధానంగా ప్రభుత్వం ఎత్తివేస్తుంది. దీంతో కొన్నాళ్లకు బేసిక్ ప్రైమరీ స్కూళ్ల కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1 నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 1718 ఉన్నాయి. వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా మన్యం జిల్లాలో సుమారు 504 ప్రాథమిక పాఠశాలలను 250 ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చనున్నారు.

జిల్లాలో సుమారు 120 యుపి పాఠశాలలను ఎత్తివేసేందుకు అవకాశం ఉన్నట్టుగా ఉపాధ్యాయ సంఘాలు విశ్లేషిస్తున్నాయి. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని చెబుతోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే 3,4,5 తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశంలేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. ఉన్నత పాఠశాలల్లో కేవలం ఇంగ్లీష్ మీడియం ఒక్కటే అమలు చేయడం వల్ల మిగిలిన భాషా పండిత పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే మిగులు పోస్టులుగా చూపుతోంది. ఇప్పటి వరకు 1:40 నిష్పత్తిగా ఉన్న ఉపాధ్యాయులు - విద్యార్థుల సంఖ్య 1:53గా పెరగనుంది. ఈ నేపథ్యంలోనూ మరికొన్ని మిగులు పోస్టులు ఉన్నట్టు ఇప్పటికే తేల్చారు.

మరోవైపు డిఎస్‌సిలోనూ 3వేల పోస్టులకు కోతపెట్టారు. ఉపాధ్యాయులు ఆశించిన ఉద్యోగోన్నతి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ విధంగా ఉపాధ్యాయుల మధ్య చిచ్చురేపే విధానాలు కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో కనిపిస్తున్నాయి. ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలకు ప్రభుత్వం అప్పగించింది. ఎమ్మెల్యేలు ద్వారా లేఖలు తీసుకొని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చే ప్రయత్నం చేపడుతోంది. అయితే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖకు సిఫార్సు చేయడం లేదు. మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు వల్ల నష్టం కలుగుతుందని, తమ పిల్లలు పాఠశాల విద్యకు దూరమవుతారని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన విద్య పొందలేరు



జీవో నెంబర్ 19 తో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను తొమ్మిది రకాలుగా విభజించనుంది. అంగన్వాడీల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విభజిస్తుంది. కానీ వారికి బోధించే వారిలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. . ఇలా చేయడం వలన ఫ్రీ ప్రైమరీగా చెప్పబడే అంగన్వాడీ పిల్లలు పౌష్టికాహారానికి, ఆటపాటలకు దూరమవుతారు. మరోవైపు అనేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయ, పిఇటి పోస్టులు రద్దు చేయబడతాయి. ఇప్పటి వరకు 1:30 గా ఉన్న విద్యార్థులు అధ్యాపకులు నిష్పత్తి కొన్ని సందర్భాల్లో ఎక్కువయ్యే పరిస్థితి ఉంది. ఇంటర్ విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు బోధించడం వలన వారు నాణ్యమైన విద్యను పొందలేరు. వయసుతో సంబంధం లేకుండా ఒకటి నుండి 12 తరగతి విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో ఉంచడం కూడా విద్యార్థుల మధ్య. ఘర్షణలకు తావిస్తుంది.

- రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

విద్య నుంచి దూరం చేయడమే..



విద్యారంగం నుంచి ప్రభుత్వం బాధ్యత తగ్గించుకుని, ఆ మేరకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభాలు చేకూర్చడమే పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ విధానం వల్ల పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయ పోస్టుల తగ్గింపే ప్రధానాంశంగా కనిపిస్తోంది. ఈ విధానానికి యుటిఎఫ్ పూర్తిగా వ్యతిరేకం. దీనికి వ్యతిరేకంగా పోరాడతాం. గత ప్రభుత్వమూ ఇదే విధానం అమలు చేసి అధికారాన్ని కోల్పోయింది. ఈ విధానాన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చికూడా తిరిగి అదే విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

శ్యామలాంబ జాతరను

సమన్వయంతో విజయవంతం చేయాలి

- అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదు
- అధికారులకు స్పష్టం చేసిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

సాలూరులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే శ్యామలాంబ అమ్మవారి జాతరను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. శ్యామలాంబ జాతర నిర్వహణపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15 ఏళ్ల తరువాత జరుగుతున్న శ్యామలాంబ జాతరకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. జాతర జరిగే మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటుచేసుకోకుండా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరకు విచ్చేసే భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో అందుకు తగినట్లుగా ఆర్‌టిసి బస్సులను నడపాలని తెలిపారు. ఇందుకు జాతర జరిగే నాలుగు రోజుల్లో నాలుగు జిల్లాలకు చెందిన 1240 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌టిసి అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయనున్నామని, తద్వారా విద్యుత్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని కలెక్టర్ సూచించారు. అనుకోని సంఘటనలు జరిగితే తక్షణమే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జాతరకు వచ్చే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం గుర్తించిన ఐదు స్థలాలను సిద్ధం చేయాలన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తుతో పాటు 30 రోప్ పార్టీలను సంసిద్ధం చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాలూరు పట్టణ రహదారుల్లో గుర్తించిన 22 పాట్ హోల్స్‌ను తక్షణమే పూర్తిచేయాలని, పాతబడిన గృహాల వద్ద, భవనాలకు దగ్గరగా ఉన్న విద్యుత్తు తీగల వద్ద ప్రజలు ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం, అందుబాటులో ఉన్న మరుగుదొడ్లతో పాటు గుర్తించిన 15 ప్రాంతాల్లో అదనంగా 50 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తహశీల్దారు, ఎంపిడిఒ, కమిషనర్ సంయుక్తంగా వాణిజ్యవేత్తలు, ఎన్‌జిఒల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేశామని, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్తును నిలిపివేస్తున్నామని, ఆ సమయంలో విద్యుత్తు అంతరాయం కలగకుండా కమిటీ సహకారంతో జనరేటర్లను ఏర్పాటుచేయనున్నట్లు విద్యుత్తు శాఖ ఎస్ఇ చలపతిరావు.. కలెక్టరుకు వివరించారు. 14 వైద్య బృందాల ద్వారా 378 మంది వైద్య సిబ్బంది జాతర ముగిసే వరకు నిత్యం సేవలు అందించాలని, అంబులెన్సులు, మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఎస్‌డిసి పి.ధర్మ చంద్రారెడ్డి, ఆలయ ఇఒ టి.రమేష్, మండల ప్రత్యేక అధికారి శివన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ డి.టి.వి.కృష్ణారావు, తహశీల్దార్ ఎన్.వి.రమణ, ఎంపిడిఒ జి.పార్వతి, ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.రవిప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, జిల్లా విపత్తుల స్పందన అధికారి కె.శ్రీనుబాబు, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, పోలీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో వికలాంగుల నమోదు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

భవిత కేంద్రాల్లో బడిఈడు వికలాంగులను గుర్తించే కార్యక్రమం ప్రారంభమైందని సహిత విద్య ఎపిసి తేజేశ్వరరావు తెలిపారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని అగ్రహారం వీధిలో ఒక బాలికను గుర్తించారు. ఈ నెల 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌పి భానుమూర్తి, తిరుమల దేవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతంపేట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ నియోజకవర్గంలో సీతంపేట మండలం పనుకువలస వద్ద ఎంఎస్ఎంఇ పార్కుకు బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేశారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి చేస్తారని, ఈ ప్రాజెక్టుకు రూ.11.39 కోట్లు ఖర్చవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పాలకొండ లాంటి గిరిజన నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కు అందుబాటులోకి వస్తే ఎన్నో గిరిజన కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ సంధ్యారాణి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళి మోహన్, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, డైరెక్టర్ కె.అప్పలనాయుడు, సర్పంచ్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, గాలులతో వర్షం కురిసింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు ఏర్పడి దానికి తోడుగా భయంకరమైన గాలులతోపాటు పిడుగులు, ఉరుముల శబ్దాలతో వర్షం కురిసింది. రహదారులన్నీ బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భానుడి ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వర్షంతో ఉపశమనం లభించింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో హమ్మయ్యా! అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

సీతంపేట : సీతంపేట మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల సమయంలో కారుమబ్బులు కమ్మి, వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది. దీంతో రైతులు, ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.



సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

పోరాటానికి సంపూర్ణ మద్దతు : సిఐటియు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా నిరవధికంగా సమ్మెలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను మానవతా దృష్టితో ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ కోరారు. ఎపిఎంసిఎ ఆధ్వర్యాన 15 రోజులుగా సిహెచ్‌ఒలు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, జాబ్‌చార్ట్ రూపొందించాలని, బకాయిలు లేకుండా వేతనాలు, అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన మంత్రి తాము రూపొందించిన చట్టాలను అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేయడం అన్యాయమన్నారు. వీరి వల్ల ఉపయోగం లేదని, తొలగిస్తే రూ.500 కోట్లు మిగులుతుందని బాధ్యతా రాహిత్యంగా వైద్య ఆరోగ్య మంత్రి మాట్లాడడం సరైనది కాదని హితవుపలికారు. మహిళలన్న విచక్షణ మరిచిపోయి మంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణమని విమర్శించారు. చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరడమే వారు చేసిన నేరమా? అని ప్రశ్నించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన పోరాటానికి సిఐటియు జిల్లాలో మద్దతు ప్రకటించిందని, ప్రభుత్వం పట్టించుకోకుంటే వారికి మద్దతుగా జిల్లావ్యాప్తంగా కార్మిక వర్గాన్ని సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

16న ఎపిజిఇఎ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సీతంపేట

ఎపిజిఇఎ పాలకొండ తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సభ్యులు గణేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు కె.శంకర్రావు హాజరుకానున్నట్లు చెప్పారు.

ఆదివాసీలు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో జీడిది ప్రత్యేక స్థానం. కొండలపై ఎటువంటి రసాయనాలు, ఎరువులు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంగా పండిన పంట ఇది. గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిస్తుంది. అలాంటిది ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడం, వాతావరణ మార్పులతో సగానికి పైగా పంట పోయింది. జీడికి సరైన మార్కెట్ ధర లేకపోవడం, సరైన సమయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో జీడిరైతులంతా కుదేలయ్యారు. వ్యాపారుల దోపిడీకి బలయ్యారు.

జీడితోట



జీడి రైతు కుదేలు

- వ్యాపారులదే హవా
- రాత్రివేళ రవాణా
- అంతంతమాత్రంగా విడివికెలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో జీడికి మంచి డిమాండ్ ఉంది. రసాయనాలు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంగా పండటమే అందుకు కారణం. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 31,900 ఎకరాల్లో జీడి తోటలు సాగవుతున్నాయి. 13,357 మంది రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా ఏడాదికి 8,932 టన్నుల పంట దిగుబడి వస్తుంది. ఈ ఏడాది అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల 4,300 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన కిలో రూ.150 నుంచి 160 చొప్పున.. సుమారు రూ.68 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉంది. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం కిలో రూ.200కు కొనుగోలు చేయాలని సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నాయి.

వాతావరణ మార్పులతో దెబ్బ

గిరిజన రైతులు జీడిపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. జీడి పూత దశలో అంటే, నవంబర్‌లోపు సరైన వర్షాలు పడితే వేపుగా పెరుగుతుంది. ఆ తర్వాత జనవరి నెలలో అకాల వర్షాలు కురవడం వల్ల పూత రాలిపోయింది. దాంతోపాటు అగ్గి తెగులు, పొగమంచు, విపరీతమైన ఎండల తీవ్రతతో దిగుబడి తగ్గింది.

తూతూ మంత్రంగా విడివికెలు

సీతంపేట ఐటిడిఎ అనుబంధంగా ఉన్న వెలుగు, జిసిసి సమన్వయంతో వన్‌ధన్ వికాస్ కేంద్రాలు నెలకొల్పారు. ఐటిడిఎ పరిధిలో 121 విడివికెలు ఉన్నాయి. అందులో సీతంపేటలో 35 ఉన్నాయి. ఈ విడివికెల ద్వారా రైతుల వద్ద జీడిపిక్కలు కొనుగోలు మాత్రం తూతూ మంత్రంగా సాగింది. దీంతో అమాయక గిరిజన రైతులు వ్యాపారుల బారిన పడ్డారు. దోపిడీకి గురయ్యారు.

తనిఖీలు చేస్తేనే..

వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఏజెన్సీలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జీడికి సేల్స్ టాక్స్ నూటికి ఐదు శాతం చెల్లించాలి. మార్కెట్ కమిటీకి నూటికి ఒక శాతం చెల్లించాలి. దాంతోపాటు గోదాంలో స్టాక్ సరిపడా రికార్డులో నమోదై ఉండాలి. క్రయవిక్రయాలు రికార్డు బుక్‌లో, బిల్ బుక్‌లో తప్పనిసరిగా ఉండాలి. ఇక జిఎస్‌టి అయితే చెప్పనవసరం లేదు. ఇవన్నీ సిటిఒ క్షుణ్ణంగా చూడాల్సి ఉందని సంఘాలు కోరుతున్నాయి.

దళారుల దోపిడీ

ఒకవైపు వాతావరణ మార్పులతో జీడి పంటపోతే దానిని అలుసుగా తీసుకొని కొందరు వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేశారు. పంట కోసే సమయంలో అకాల వర్షాలు కురవడంతో జీడిపిక్క నలుపు వచ్చింది. దీనిని కుంటిసాకుగా చూపించే కిలో జీడి పిక్కలు రూ.130 నుంచి 140కే కొనుగోలు చేయసాగారు. ఇక్కడ తక్కువగా కొనుగోలు చేసిన జీడిని రాత్రివేళల్లో ఒడిశాలోని రాయగడకు, అక్కడి నుంచి చత్తీస్‌గడ్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడ మంచి ధర రావడంతో వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు.



రాత్రి వేళ జీడి పిక్కల బస్తాలు లోడింగ్ చేస్తున్న వ్యాపారులు



జిల్లేడుపాడులో మూతపడిన జీడి ప్రాసెసింగ్ యూనిట్


ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి



జీడి తోటలకు ఎకరానికి రూ.15 వేలు వరకు ఖర్చు అవుతుంది. చెట్లు చుట్టూ శుభ్రం చేయడానికి, కొమ్మలు కటింగ్‌కు, పిక్కలు ఏరడానికి పెట్టుబడి పెట్టాలి. అకాల వర్షాలతోపాటు అగ్గి తెగులు వల్ల పంట దిగుబడి తగ్గింది. దీంతోపాటు జీడి మార్కెట్ ధర 140 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల నష్టపోయాం.

- ఎ.తోటన్న, గిరిజనుడు, ఈతమానుగూడ

కిలో జీడి 200 కొనుగోలు చేయాలి



కిలో జీడి రూ.200కి కొనుగోలు చేయాలి. రూ.160 ఉన్న కిలో జీడి ఈ వారం రోజుల్లో రూ.140కు ధర పడిపోయింది. వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారారు. విడివికెలు తూతూ మంత్రంగా పనిచేస్తున్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారులు, సిటిఒ ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలి.

- ఎం.తిరుపతిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

50 శాతం దిగుబడి తగ్గింది



సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఏడాదికి 31,900 ఎకరాల్లో 8,932 మెట్రిక్ టన్నుల జీడి దిగుబడి రావాల్సి ఉంది. జీడిపిక్కలు పూత దశలో ఉన్నప్పుడు జనవరిలో అకాల వర్షాలు పడటం వల్ల దిగుబడి తగ్గింది. ఎండల తీవ్రత అధికంగా ఉండటం పూత మాడింది. చివరికి 4300 మెట్రిక్ టన్నుల పంట వచ్చింది.

- ఎస్.వి.గణేష్, ఉద్యానశాఖాధికారి, సీతంపేట ఐటిడిఎ

5.5 టన్నులు కొనుగోలు చేశాం



సీతంపేట, భామిని మండలాల్లోని 13 కేంద్రాల్లో 5.5 టన్నుల జీడిపిక్కలు కొనుగోలు చేశాం మార్కెట్ ధర కల్పించాం. 20 టన్నులు లక్ష్యం పెట్టుకున్నాం.

-ఎం.సన్యాసిరావు, ఎపిడి, వెలుగు

సమ్మె విజయవంతానికి విస్తృత ప్రచారం



పార్వతీపురంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సార్వత్రిక సమ్మె విజయవంతానికి సిఐటియు ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేపడుతున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించి, ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి రమణ, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాపాక శ్రీనివాసరావు, ప్రసాద్, లక్ష్మణ, తిరుపతిరావు, హనుమంతు రాము తదితరులు పాల్గొన్నారు..

సీతానగరం : సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, జి.వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు కోరారు. సమ్మెను విజయవంతం చేయాలని సీతానగరంలో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రమణమూర్తి, వి.రామలక్ష్మి, ఆర్.రాము, వై.రామారావు, మర్రాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఈ నెల 20న చేపట్టే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు వాల్‌పోస్టర్లను బుధవారం కొమరాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఆటో యూనియన్ నాయకులు అంజి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడారు.



సీతానగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మక్కువ : కార్మికులకు నష్టం చేసే చట్టాలు ముందుకు తెచ్చి కార్మికులకు గొంతు కోయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని సిఐటియు మండల కన్వీనర్ జి.కృష్ణ, దాలమ్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్

భూ రీసర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-సీతానగరం

భూముల రీసర్వే వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులకు సూచించారు. మండలంలోని దయానిధిపురం గ్రామంలో చేపడుతున్న భూ సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో లచ్చయ్యపేట గ్రామంలో చేపట్టిన భూ సర్వే రికార్డులను పరిశీలించారు. రెండో విడతలో బల్లకృష్ణాపురం, దయానిధి పురంలో రీసర్వే పనులు చేపట్టిన అధికారులతో మాట్లాడి, రికార్డులు పరిశీలించారు. రీసర్వే సమాచారం ఎప్పటికప్పుడు విఆర్ఒలు అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డిటి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శ్మశానానికి సిసి రోడ్డు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బాబూ జగ్జీవన్‌రాం కాలనీ సమీపంలో ఉన్న శ్మశానవాటికకు ఎట్టకేలకు సిసి రహదారి పనులు చేపట్టారు. వీరఘట్టం మేజర్ పంచాయతీ సాధారణ నిధుల నుంచి సుమారు రూ.3.24 లక్షలతో సిసి రహదారితోపాటు ఇరువైపులా కాలువలు కూడా నిర్మించారు. చిన్నపాటి చినుకు పడినా శ్మశానవాటిక రహదారి బురదమయం అయ్యేది. దీంతో అంత్యక్రియలకు మృతదేహాలకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. సిసి రోడ్డు నిర్మాణంతో ఆ ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది.

ప్రజల బాగోగులు పట్టని సర్కారు

ప్రజాశక్తి-మక్కువ



అధ్వానంగా తయారైన రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. సాలూరు -మక్కువ మెయిన్ రోడ్డును కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల రామకృష్ణ, ఆ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు బుధవారం పరిశీలించారు. రోడ్డంతా ఉన్న గోతులను చూసి వారు విస్మయం వ్యక్తం చేశారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి చూస్తే బాధాకరంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమం, ప్రజా బాగోగులు చూస్తామని చెప్పి వారి ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు పదవి అలంకరించాక ప్రజలను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. సంక్రాంతి లోపు రహదారులన్నీ గోతులు లేకుండా చేస్తామన్న కూటమి పాలకులు ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టారని విమర్శించారు. సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే సాలూరు- మక్కువ మెయిన్ రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే... మిగతా మారుమూల గ్రామాల పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ఎద్దేవా చేశారు. జిల్లాలో రహదారులు, భవనాల శాఖ ఉన్నట్లు తమకు అనిపించడం లేదన్నారు. పాలన అగమ్య గోచరంగా ఉందన్నారు. కళ్ల ముందే గతుకుల రోడ్లు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలన్నారు.

నవధాన్యాలతో భూసారం

ప్రజాశక్తి-సీతానగరం

నవధాన్యాలు సాగు చేయడంతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలోని సూరంపేట గ్రామంలో నవధాన్యాల ప్రయోజనాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. దీని కోసం ఈ నెల 20తేదిలోగా రైతులు ఆర్‌ఎస్‌కెలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని కిరప గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్డులను ఆ పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం బుధవారం పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

భర్త మందలించాడని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల కథనం ప్రకారం.. గరుగుబిల్లి మండలం ఎస్‌ఆర్ పేట గ్రామానికి చెందిన జట్ల మాధవికి వివాహమై సుమారు ఏడేళ్లు కావస్తోంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతూ ఉండడంతో భర్త రమేష్, ఆమె తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై తెల్లవారు జామున గడ్డి మందు తాగింది. వాంతులు కావడంతో గమనించిన ఆమె భర్త రమేష్ మోటార్ సైకిల్ పై పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చికిత్స అందించారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేసరగూడ నుంచి గుమ్మలక్ష్మీపురం వస్తున్న ఆటో బుధవారం బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఆరిక అనిల్ కుమార్, సీమల క్రాంతికుమార్ తీవ్రంగా గాయపడ్డారు. కేసరిగూడ మలుపు వద్ద ఆవు అడ్డంగా రావడంతో ఆటో బోల్తా పడింది. అనిల్‌కు చేతులు, కాళ్లకు, క్రాంతికి తలపై తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వైద్యం కోసం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం నుంచి విజయనగరం అక్రమంగా తరలిస్తున్న నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే హెచ్‌సి రత్నకుమార్ తెలిపారు. బుధవారం ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి రోడ్ మార్గంలో పార్వతీపురం రైల్వేస్టేషన్‌కి వచ్చి విజయనగరం తరలించడానికి ఎదురుచూస్తున్న రాయగడకు చెందిన నరేంద్ర టేక్రి నుండి 150 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

తొలి బుధవారం ఎఎసి సమావేశం

- అసంపూర్తి భవనాలు త్వరగా పూర్తికావాలి
- మలేరియా కేసులు ఉండటానికి వీల్లేదు
- జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని ప్రతి సచివాలయ పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ (ఎఎసి) సమావేశాన్ని ఇకపై ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులకు స్పష్టం చేశారు. కమిటీ సమావేశంలో తీసుకున్న చర్యలు, తద్వారా వచ్చిన ఫలితాలపై ఇక నుంచి సమీక్షిస్తామని తేల్చిచెప్పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఇతర జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో కొత్తగా నిర్మించి అసంపూర్తిగా ఉన్న సిహెచ్‌సిలు, పిహెచ్‌సిలు, బిహెచ్‌పియులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ప్రధానంగా సీతానగరం, మామిడిపల్లి, శంబర పిహెచ్‌సిల పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. చిన్న చిన్న పనులు జరగక భవనాలు నిరుపయోగంగా ఉండటం సబబు కాదని చెప్పారు. ప్రభుత్వం తప్పక నిధులు విడుదల చేస్తుందనే భరోసా కల్పించి ఆయా కాంట్రాక్టర్లతో పనులు త్వరగా చేయించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో మలేరియా కేసులు ఉండటానికి వీల్లేదని, పోలియో, ఎయిడ్స్ మాదిరిగా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మలేరియా కేసులు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి వారం తాగునీటి ట్యాంకులను పరిశీలించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఉద్బోధించారు. రోగుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్, సిహెచ్‌డబ్ల్యు, ఎంహెచ్ఒలలో ఎవరు సక్రమంగా పనిచేయకపోయినా సంబంధిత వైద్యాధికారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అనిమియా ముక్త్ పార్వతీపురం దిశగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా టిబి నియంత్రణ అధికారి ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు, డిఐఒ ఎం.నారాయణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగ శివజ్యోతి, డిఎంఒ వై.మణి, డిప్యూటీ డిఎంహెచ్ఒలు కె.విజయపార్వతి, కె.వి.ఎస్.పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి జె.మురళి కోరారు. తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 80 మంది నిరుద్యోగ యువతకు జీవిత మార్గదర్శకాలపై మూడు రోజుల శిక్షణను జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు అధ్యక్షతన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జె.మురళి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి? విజయాలను ఎలా అందుకోవాలి? ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తిని ఎలా పెంచుకోవాలి? తెలివితేటలను ఎలా వృద్ధి చేసుకోవాలి? తదితర అంశాలను వివరించారు. మనసు రోజులో 60 వేల ఆలోచనలు చేస్తుందని, అందులో ఉత్తమమైనవి ఆచరించి, ఉన్నత శిఖరాలను సాధించడానికి మెట్లుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు ఉదయ భాస్కరరావు, శ్రీధర్, సోమశేఖర్, వాలంటీర్ ఉమ పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌కు హాజరైన జనం

విపత్కర పరిస్థితుల్లో అప్రమత్తం

ప్రజల సన్నద్ధతకే మాక్‌డ్రిల్ : కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

అత్యవసర, ప్రమాద సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలను సన్నద్ధం చేసి, స్వీయరక్షణ పొందేందుకే మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, యుద్ధ వాతావరణ సమయంలో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడతాయని చెప్పారు. అత్యవసర సమయాల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే పరిస్థితిలో తీవ్రత ఉందని గ్రహించాలని, అందుకు తగిన విధంగా సురక్షిత చర్యలు తీసుకోవడంతోపాటు అధికార యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, జిల్లా విపత్తుల రక్షణ, అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, ఎపి ఎస్‌డిఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ రఘు, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తులను తరలిస్తున్నట్లు ఎస్‌డిఆర్ఎఫ్ బృందం ప్రదర్శన

'ప్రోటోకాల్'పై భగ్గుమన్న కౌన్సిలర్లు

- మరుగుదొడ్ల మరమ్మతులపై నిలదీత
- మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో 26వ వార్డులో పైలట్ వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ పేరు ఎందుకు లేదని కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, సింగారపు ఈశ్వరరావు, బి.శ్రీనివాసరావు భగ్గుమన్నారు. బుధవారం చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో కౌన్సిలర్లు కమిషనర్ డిటివి కృష్ణారావు, అధికారులను నిలదీశారు. పట్టణంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో అధికారులు ఎందుకు ప్రోటోకాల్ పాటించలేదని ప్రశ్నించారు. దీనిపై డిఇ ప్రసాద్ మాట్లాడుతూ 26వ వార్డులో పైలట్ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం అప్పటికప్పుడు చేయాల్సి వచ్చిందని, అందువల్లనే శిలాఫలకంలో చైర్‌పర్సన్ పేరు లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ముమ్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. పండుగ నాలుగు రోజుల్లో వస్తుంటే అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. సామాజిక మరుగుదొడ్లు మరమ్మతులు కాకపోవడంతో మురికివాడల్లో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 11వ వార్డులో పాడైన పైలట్ వాటర్ స్కీమ్‌కు మరమ్మతు చేయాలని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయిందని కౌన్సిలర్ లింగాల దుర్గా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సభ్యులు అజెండాలో ఉన్న అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం సాలూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. మున్సిపల్ డిఎంఎ విజయవాడలో అన్ని సంఘాలను చర్చలకు పిలిచి జీతాల సమస్యపై మంత్రితో చర్చిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటికే అనేక దఫాలు కార్మిక సంఘాలతో కార్మికుల సమస్యలపై చర్చించారని తెలిపారు. ఇంకా కాలయాపన చేయడం దారుణమన్నారు. ఇప్పటికే కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి జూన్ ఒకటో తేది వరకు గడువిస్తున్నామని, లేకుంటే అన్ని సంఘాలను కలుపుకొని నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు డి.సంతోష్, కాశి, ఈశ్వరరావు, శ్రీను, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని 75 మంది మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పిఎఫ్ సమస్యను ఐదేళ్ల నుంచి పరిష్కరించడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో ఈ సమస్యలపై చర్చలు జరిపారు. ఇప్పటికైనా స్థానిక మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి మూడేళ్ల పిఎఫ్ మొత్తాన్ని కార్మికుల పిఎఫ్ ఖాతాకు జమ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. చెత్త సేకరణ బళ్లు మరమ్మతులకు గురయ్యాన్ని, వాటిని బాగుచేయాలని కమిషనర్‌ను కోరారు. పెరుగుతున్న పట్టణ జనాభాకి, విస్తీర్ణానికి తగినట్టుగా అదనంగా కార్మికులను నియమించాలని కోరారు. ఈ సమస్యలపై తక్షణమే చర్యలు చేపడతానని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు సిహెచ్ సింహాచలం, నాగవంశం మల్లేష్, శంకరరావు, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు



కూలిన కల్వర్టు పక్కనుంచే వెళ్తున్న జనం

పట్టించుకోని ఉత్సవ కమిటీ, అధికారులు

ప్రజాశక్తి-సాలూరు

శ్యామలాంబ అమ్మవారి గద్దెకు వెళ్ళే దారిలో జన్నివీధిలో కల్వర్టు కుంగిపోయి చాలా కాలమైంది. పండగ మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. పట్టణంలోని జన్నివీధిలో శ్యామలాంబ అమ్మవారి గద్దె ఉంది. పండగ ప్రారంభానికి ముందు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి గద్దెకి వెళ్లి అక్కడ ఘటాలకు పూజలు నిర్వహిస్తున్నారు. అసలే ఇరుకుగా ఉన్న జన్నివీధిలో శ్యామలాంబ అమ్మవారి గద్దెకి వెళ్ళే దారిలో రోజూ వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. భక్తుల క్యూలైన్ పక్కనే ఉన్న కల్వర్టు కుంగిపోయింది. భక్తులు ఆదమరిచి కుంగిన కల్వర్టు వైపు వెళితే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. పండగ నిర్వహణలో అమ్మవారి గద్దె కూడా కీలకమైన ప్రదేశం. ఇలాంటి దారిలో కుంగిపోయిన కల్వర్టుని ఇప్పటికే మున్సిపల్ అధికారులు నిర్మించాలి. కనీసం ఉత్సవ కమిటీ అయినా దీని నిర్మాణానికి చర్యలు తీసుకుని ఉండాలి. కానీ ఏదీ జరగలేదు. పండగను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి చందాలు వసూలు చేసే పనుల్లో బిజీగా ఉన్న ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి గద్దెకెళ్లే దారిలో కుంగిన కల్వర్టు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పండగకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత కొన్ని నెలలుగా వార్డు కౌన్సిలర్ ఎం.సరోజిని కుంగిపోయిన కల్వర్టు గురించి మున్సిపల్ అధికారులను హెచ్చరిస్తున్నారు. కానీ వారు పట్టించుకున్న పాపాన పోలేదు. బుధవారం నిర్వహించిన అత్యవసర మున్సిపల్ సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించి అంశాలను ఆమోదించారు. మరో నాలుగు రోజుల్లో పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేసే అవకాశం లేదు. ఇంతవరకు ఉత్సవ కమిటీ సభ్యులు, మున్సిపల్, పోలీసులు,ఇతర అధికారులతో సమన్వయ సమావేశం కూడా నిర్వహించిన దాఖలాలు లేవు.

స్ప్రేయింగ్ సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నిర్మూలనలో భాగంగా గిరిజన గ్రామాల్లో చేపడుతున్న ఐఆర్ఎస్ ఎసిఎం స్ప్రేయింగ్ సక్రమంగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి వై.మణి అన్నారు. బుధవారం జియ్యమ్మవలస మండలం నిడగల్లుగూడ గ్రామంలో చేపడుతున్న స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. గ్రామంలో ప్రజలందరికీ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్లు కె.రాధాకృష్ణ, రాజశేఖర్, హెచ్.వి ఇస్తార్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నిడగల్లుగూడలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంఒ మణి